క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రమణకుమార్



సత్యవేడు: ఇన్‌చార్జి ఎంపీడీఓగా జే. రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాపరిషత్ సీఈఓ పి. ప్రభాకర్ రెడ్డి బుధవారం రమణకుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

వీధి లైట్లకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పల్లమాల గ్రామంలోని వీధి లైట్లకు బుధవారం సర్పంచ్ రమణమ్మ మరమ్మతులు చేయించడంతోపాటు పారిశుధ్యం మెరుగు పరిచారు. గ్రామం, దళితవాడలోని మురుగు కాలువల్లో మురుగును కూలీలతో తొలగించారు. అలాగే వీధుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు.

సీసం తాపడం పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాతి బండల మధ్య సీసం తాపడం పనులకు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమిపూజ చేశారు. బండల మధ్య పగుళ్లు ఏర్పడి, చీలికలు ఉండడంతో రూ.35లక్షలతో ఈ పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి: పట్టణంలో జయరామారావు వీధిలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో ప్రతిభ చాటారు. వారిని బుధవారం బియ్యపు పవిత్రారెడ్డి అభినందించి ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రతిభ చాటిన శ్రీరామనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు. ప్రిన్సిపల్ ఈశ్వరయ్య, డీన్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



సురేంద్ర (ఫైల్)

ఏర్పేడు: తన భర్త అదృశ్యమయ్యాడని ఓ మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. మండలంలోని పిల్లారిగుంట ఎస్టీ కాలనీకి చెందిన సురేంద్ర(28) ఈ నెల 5న రాత్రి భోజనం చేసి నిద్రించాడు. 6న ఉదయం అతడి భార్య నిరోషా నిద్రలేచి చూడగా సురేంద్ర కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు. 9440900729 ఫోన్ నంబరు సమాచారం ఇవ్వాలని సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏర్పేడు: తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన కథనం ..మండలంలోని బండారుపల్లెకు చెందిన దామోదరం(49) ఈ నెల 12న కడుపు నొప్పి భరించలేక విషపు గుళికలు మింగాడు. తొలుత శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తిరుపతి రుయాకు, మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రాఘవేంద్ర హెచ్చరించారు. బుధవారం మండలంలోని బైపాస్‌రోడ్డు నుంచి చియ్యవరానికి వెళ్లే మార్గంలోని గుండేలుగుంట గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్, వాహనపత్రాలు కలిగి ఉండాలని వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తే వాహనాలకు సీజ్ చేస్తామన్నారు. వాహనాల తనిఖీలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చాక్లెట్ కావాలా..రోడ్డు కావాలా?

- బాలికను ప్రశ్నించిన ఎమ్మెల్యే
- రోడ్డు కావాలని కోరిన బాలిక
- మా ఊరొచ్చిన తొలి ఎమ్మెల్యే మీరే సార్..!
- 'గడప గడపకు మనప్రభుత్వం'లో రామలింగాపురం ఎస్టీ కాలనీ వాసుల హర్షం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఎస్టీకాలనీలో మహిళకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఎమ్మెల్యే : ఏమ్మా! పాపా..నీకు చాక్లెట్ కావాలా? రోడ్డు కావాలా?

బాలిక : మా ఊరికి రోడ్డు లేక చానా కష్టాలు పడతాండారు సార్..ఏ బండ్లు (వాహనాలు) కూడా రావు సార్..పాము కరిచి ముగ్గురు సచ్చిపోయినారు కూడా..రోడ్డే ఉంటే ఆస్పత్రికి తీసుకుపోయేవాళ్లు కదా..బతికి ఉండేవాళ్లేమో..రోడ్డేపిస్తే చాలు సార్..మా ఊరోల్లకి సగం బాధలు తీర్తాయి.

ఎమ్మెల్యే : సరే! మీ ఊరికి రోడ్డే కాదు..అన్ని సమస్యలూ తీరుస్తా.. సరేనా? (ఆ బాలిక తలను ఆప్యాయంగా నిమిరి నవ్వుతూ ఎమ్మెల్యే చాక్లెట్ ఇచ్చారు)

గ్రామస్తులు : సార్..ఇన్నేండ్లలో ఒక్కతూరి కూడా ఏ ఎమ్మెల్యే మా ఊరికి రాలా..మా సమస్యలూ పట్టించుకోలా..తొలిసారి వచ్చింది మీరే..అన్నీ తీరస్తా అన్నారు..చానా సంతోసంగా ఉంది..

.....

శ్రీకాళహస్తి రూరల్: బుధవారం శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ సచివాలయ పరిధిలోని రామలింగాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఓ 8 ఏళ్ల బాలికకు నడుమ సాగిన ఆసక్తికర సంభాషణ ఇది. మొత్తంగా పంచాయతీలో 180 ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాల అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. ఇక, పంచాయతీ కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఎస్టీ కాలనీ ఉంది.

గ్రామస్తులు ఏమన్నారంటే..

"ఎన్నో ప్రభుత్వాలు వచ్చినాయి..పోయినాయి..అయినా ఇప్పటిదాకా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా మా కాలనీకి రాలా. తొలిసారి వచ్చింది మీరే..చానా..చానా సంతోసంగా ఉందాది మాకు. ఈడ 30 కుటుంబాలున్నాయి..రోడ్డు లేక చానా అగచాట్లు పడతాండాం. కాలనీకి రోడ్డు లేక చాలా అగచాట్లు పడతాండాం. ఒళ్లు బాగలేకపోతే ఆస్పత్రికి తీస్కొని పోయేదానికీ కష్టమే. కాలనీలో 10 కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందలేదు.. మాకు తాగేనీళ్లు, ఇళ్లు ఇప్పించాల.. ఈడ మొత్తం 22 మంది పిలకాయలు ఉండారు. వీళ్లంతా రామలింగాపురంలోని స్కూలుకు, అంగన్‌వాడీ బడికి పోవాలంటే 4 కిలోమీటర్లు పోవాలి..అంతదూరం పోలేక నిల్చిపోయినారు." అని సమస్యలు ఏకరువు పెట్టారు.

ఎమ్మెల్యే ఎలా స్పందించారంటే..

"మీ కాలనీకి వచ్చేటప్పుడు దారి చాలా అధ్వానంగా ఉండటం చూశానయ్యా!.. మీరు ఇక్కడే ఉండాలంటే రోడ్డు, హౌసింగ్, తాగునీటి వసతి కల్పిస్తాను.. కావాలంటే రామాపురం రెవెన్యూలో మెయిన్ రోడ్డు పక్కన కొత్తకాలనీ కట్టించి, అక్కడే అన్ని సౌకర్యాలతో ఆదర్శకాలనీగా చేస్తా.. మీరు ఏది కావాలన్నా చేస్తా.. ఇక, మీ కాలనీ పిలకాయలు స్కూలు, అంగన్‌వాడీకి పోయేదానికి ఆటో ఏర్పాటు చేపిస్తా.. దానికి ఖర్చులూ నేనే భరిస్తా". అని చెప్పడంలో ఎస్టీల ఆనందానికి అంతులేకుండాపోయింది. అలాగే కాలనీ మహిళకు సీమంతం చేసి ఆశీర్వదించారు. మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ బర్రె సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ పల్లమాల గోవిందరెడ్డి, సర్పంచ్ పోలంరెడ్డి భక్తకంతేశ్వరరెడ్డి, మురగయ్య, శంకరయ్య, మనోహర్, బాలు, గురవయ్య, వెంకటేష్, గంగారాం, పాండురంగారెడ్డి, రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డి, మునగాల మధుసూదన్‌రావు, కందాటి ఈశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, సర్పంచులు చుక్కల కిరణ్, రామిరెడ్డి, పుట్టంరెడ్డి బాలిరెడ్డి, ఏనుగారి నాగభూషణ్‌యాదవ్, చెంచయ్యయాదవ్, హరియాదవ్, జయరాం యాదవ్, మధుమోహన్‌రెడ్డి, రఘురెడ్డి, కప్పా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో భరోసా



లబ్ధిదారులు పథకాలతో పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- పేద కుటుంబాల్లో వెలుగులు
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ పథకాలతో ఆర్థిక భరోసా ఇచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పునరుద్ఘాటించారు. మండలంలోని రాయపేడు బు ధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారితో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ పాలనతో నవరత్నాల ద్వారా గ్రామంలోని సుమారు 329 కుటుంబాలకు 12.10 కోట్ల వరకూ లబ్ధి చేకూరినట్లు సంక్షేమ బుక్‌లెట్లతో ఆయన వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఆ తర్వాత మా భవిష్యత్తు నువ్వే జగనన్న స్టిక్కర్లను వారి గృహాలకు అతికించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించి తనకు నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓను ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానికంగా నిర్మిస్తున్న రైతుభరోసా, సచివాలయ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

పార్టీ నేతలను పరామర్శ

పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఏ ఒక్క కార్యకర్తనూ వదులుకోమని ఎమ్మెల్యే అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు(సీనియర్ నేత) బందిల డేవిడ్, రైతు విభాగం జిల్లా నేత లోకనాథరెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని, వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ తేరణి ధనుంజయరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, సచివాలయ కన్వీనర్లు హరినాథ్, వసంతయ్య ,నాగయ్య, శాస్త్రిరాజు, ముఖ్యనేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, ఎంపీటీసీలు అయ్యప్ప, మూర్తి సుబ్బన్న, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



డేవిడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నేడు నాగలాపురంలో గడప గడపకు..

పిచ్చాటూరు: నాగలాపురం–3 సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించనున్నట్లు మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిత



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: బాగా చదువుకుంటేనే ఉజ్వల భవితతో ఉన్నత స్థానానికి చేరుకుంటారని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని కారణి ప్రాథమిక పాఠశాలలో బుధవారం 39వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్లు కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా ఉంటున్నాయని, చదువుల్లో కూడా బాగా రాణిస్తున్నారన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మున్నెమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ మహేష్, ఉపాధ్యాయులు విజయకుమారి, భాగ్యలత, లీలాకుమార్, భారతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



తిరుపతిలో వేదనారాయణ స్వామి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం బుధవారం తిరుపతిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, మే 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, ఇందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. 4న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 8న గరుడ సేవ, 11న రథోత్సవం, 12న ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్యలు పరిష్కారం

- గోపాలరావుకాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మార్పు
- సంతవేలూరులో తాగునీటి అవసరాలకు నూతన బోరుకు విద్యుత్ సౌకర్యం



గోపాలరావుకాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చిన దృశ్యం

వరదయ్యపాళెం: మండలంలోని గోపాలరావుకాలనీ, సంతవేలూరులో నెలకొన్న విద్యుత్ సమస్యలు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో పరిష్కారమయ్యాయి. ఇటీవల వరదయ్యపాళెం పంచాయతీ గోపాలరావుకాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేతికందే ఎత్తులో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చాలని, అలాగే సంతవేలూరులో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. వీటిపై ఆయన స్పందించారు. తక్షణమే అక్కడ నూతన బోరును వేయించారు. నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో ఊరు బయట ఏర్పాటు చేసిన బోరు మోటారుకు అదనపు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరడంతో ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత 2 గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని ట్రాన్స్‌కో నాగలాపురం ఏడీ చంద్రానాయక్, ఏఈ శివప్రసాద్‌లను ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనులు చేయించారు. గోపాలరావు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చడంతో పాటు సంతవేలూరులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటారుకు ప్రత్యేక లైను వేసి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి



శ్రీకాళహస్తి: సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్యామల ఈశ్వరయ్యగౌడ్, వెంకటముని గౌడ్, ఎ.పురుషోత్తంగౌడ్, టి.పురుషోత్తంగౌడ్, మోహన్‌గౌ, నారాయణస్వామిగౌడ్, శ్రీరాములగౌడ్, గోపాలకృష్ణగౌడ్, నాగరాజుగౌడ్, లోకేష్‌గౌడ్, గోపిగౌడ్, బాలా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఉద్యోగాలకు 15 మంది ఎంపిక

చిట్టమూరు: శ్రీసిటీ సెజ్‌లోని ఏటూబీ కంపెనీలో ఉద్యోగాలకు 15 మంది ఎంపిక అయ్యారని ఆ సంస్థ ప్రతినిధి కొమరేషన్ తెలిపారు. బుధవారం మల్లాంలోని సీవీఎస్‌ఆర్ జూనియర్ కళాశాల్లో జాబ్‌మేళా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల జీతంతోపాటు, ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కంపెనీ కల్పిస్తుందన్నారు.

మద్యం ధ్వంసం

నాయుడుపేటటౌన్: నాయుడుపేట, వెంకటగిరి ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేసిన రూ.1.74 లక్షల విలువైన మద్యం బాటిళ్లను స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయ ఆవరణలో ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ గూడూరు డివిజన్ ఏఈఎస్ కే జానకిరామ్ తెలిపారు.

దోమల నిర్మూలనకు పిచికారీ



పిచికారీ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్

ఏర్పేడు: మండలంలోని కోబాక పంచాయతీ గ్రామాల్లో బుధవారం సర్పంచ్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో దోమల నిర్మూలనకు క్రిమి సంహారక మందు పిచికారీ చేశారు. కోబాక, ఎస్సీ, ఎస్టీ కాలనీ, కోబాక మిట్ట ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువలు, గుంతలు, చేతిపంపులు, తాగునీటి కొళాయిలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద నిల్వ ఉన్న మురుగునీటిలో పిచికారీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చెంగల్రాయులు, పంచాయతీ కార్యదర్శి లోకముని పాల్గొన్నారు.

27న ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఈ నెల 27న భూమిపూజ చేయనున్నట్లు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. భూమి పూజకు ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీరంగం పీఠాధిపతులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్‌కుమార్, శ్రీహరి, ప్రతాప్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

షబేఖదర్ ప్రత్యేక ప్రార్థనలు



సహారి విందులో పాల్గొన్న ముస్లింలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు మసీదుల్లో మంగళవారం రాత్రి ముస్లింలు జాగారాలు చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. షబేఖదర్ రాత్రి దివ్య ఖురాన్ అవతరించిన మహిమ గల రాత్రిగా మత పెద్దలు వివరించారు. మసీదుల్లో రాత్రంతా మేలుకుని ఖురాన్ పారాయణం, ప్రత్యేక నమాజులు చేశారు.

రూ.1.74 లక్షల విలువైన మద్యం ధ్వంసం

నాయుడుపేటటౌన్: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయ ఆవరణలో బుధవారం నాయుడు పేట, వెంకటగిరి ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేసిన రూ.1.74 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ గూడూరు డివిజన్ ఏఈఎస్ కే జానకిరామ్ తెలిపారు. 47 అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన 761 బాటిళ్ల(215 లీటర్లు) మద్యం ధ్వంసం చేశామన్నారు. ఎస్ ఈబీ ఇన్‌స్పెక్టర్లు ఆర్‌యూవీఎస్ ప్రసాద్, పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆదిశంకర జయంతి ఉత్సవాలు

వెంకటగిరి: పట్టణంలోని శ్రీ శంకరమఠంలో ఆదిశంకర జయంతి ఉత్సవాలు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ మఠం గౌర వాధ్యక్షుడు వి సూర్యనారాయణ బుధవారం ఓ ప్ర కటనలో పేర్కొన్నారు. 21వ తేదీ నుంచి ప్రతిరోజు నామసంకీర్తన, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అందరికీ సంక్షేమ ఫలాలు



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల జేసీఎస్ ఇన్‌చార్జి భక్తవత్సలం అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకన్నలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధి గురించి వివరించారు. అనంతరం వారి ఇళ్లు, సెల్‌ఫోన్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. వారి సెల్‌ఫోన్ల నుంచి 8296082960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చారు.కార్యక్రమంలో కన్నలి నరసింహారెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, చోడవరం భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మ, మధు, చెంచయ్య, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రాజయ్య

సత్యవేడు: వేసవి నేపథ్యంలో పెట్రో బంకులు, పరిశ్రమలు, వైద్యశాలల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి పి.రాజయ్య కోరారు. బుధవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక పెట్రోలు బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంటలు ఆర్పే యంత్రాలతో పాటు నీటి సౌలభ్యం కలిగి ఉండాలని కోరారు. ప్రమాదాలు జరిగితే తక్షణ చర్యలు నివారణ చర్యలు తీసుకోవాలో ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే నీళ్లలో ముంచిన దుప్పటితో సిలిండర్ మంటపై చుట్టి ఎలా ఆర్పాలి? బకెట్‌తో ఎలా మూయాలో తెలియజేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ గోవిందరాజులు, వేలు, సిబ్బంది రమణమూర్తి, నరేష్, పెట్రోలు బంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

–ఇంటింటికీ వెళ్లి అధ్యాపకుల ప్రచారం



విద్యార్థులను తమ కళాశాలలో చేర్పించాలని ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

పిచ్చాటూరు: ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలంటూ స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు 10వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కోరారు. 10వ తరగతి పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో స్థానిక జూనియర్ కళాశాల లెక్చరర్లు విద్యార్థుల ఇళ్లబాట పట్టారు. తమ కళాశాలలో మంచి ల్యాబ్ సౌకర్యంతో పాటు అన్ని వసతులు ఉన్నాయని, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తామని తల్లిదండ్రులు, విద్యార్థులకు వివరించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేషాద్రి, ప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందుకున్న కొందరు మహిళలతో మసీదు పెద్దలు

రేణిగుంట: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని అన్నాసామిపల్లెలో 80మంది ముస్లిం మహిళలకు రేణిగుంటకు చెందిన ఇస్మాయిల్ మసీదు ట్రెజరర్ షాజహాన్, ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో శాంతి, సౌఖ్యాలు కలగాలని వారు అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ మసీదు ముతవల్లీ వలీసాహెబ్, ఖాదర్‌వలీ, ఇమామ్,రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుగుంట ఎస్టీ కాలనీలో బోరు ఏర్పాటు



తాగునీటి చేతిపంపును ప్రారంభిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: తాగునీటికి అవస్థలు పడుతున్నామని వారం క్రితం మండలంలోని చుక్కలనిడిగల్లు పంచాయతీ ఓటుగుంట ఎస్టీ కాలనీ వాసులు శ్రీకాళహస్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి నివేదించారు. దీనిపై ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతిపంపు అమర్చారు. బుధవారం తొట్టంబేడు, రేణిగుంట మండలాల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి ఆ కాలనీలో పూజలు చేసి చేతిబోరును ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కల కిరణ్ పాల్గొన్నారు.